విత్తనాల ఎంపిక కీలకం

- నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు
- తెగుళ్లు దూరం
- తగ్గుతున్న సాగు ఖర్చులు



వలసపల్లి ఆర్‌బీకేలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

ముసునూరు: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముందస్తుగా ప్రారంభం కానున్న దశలో వరి పంట విత్తన ఎంపికలో జాగ్రత్త వహించాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. నకిలీ విత్తనాలను ఎంపిక చేసుకుంటే, పంట దిగుబడులు రాక రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వ గుర్తింపు ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. రైతుల నిరక్షరాస్యత, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని విత్తన దుకాణదారులు నకిలీ విత్తనాలను విక్రయించే అవకాశం ఉంది. వీటిని సాగుచేస్తే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు వహించాలని, నాణ్యమైన విత్తనాలను విత్తుకోవాలని సూచిస్తున్నారు. రైతులు విత్తనాల ఎంపిక, కొనుగోలు విషయంలో జాగ్రత్త పడాలి. ఎరువులు, పురుగుమందులు, విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. నకిలీ, నాసిరకం విత్తనాలు విక్రయించే షాపులపై అధికారులు కఠిన చర్యలు చేపట్టి, కేసులు నమోదు చేయాలి.

విత్తనాల ఎంపిక ఇలా..

విత్తనాల ఎంపికలో రైతులు అప్రమత్తతతో వ్యవహరించాలి. నాణ్యత గల విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. విత్తనాలన్నీ ఒకే పరిమాణంలో ఉండే విధంగాఎంపిక చేసుకుంటే పంట పెరుగుదల సమంగా ఉండి ఒకేసారి కోతకు వస్తుంది. తెగులు సోకని విత్తనాలను ఎంపిక చేసుకుంటే ఆరోగ్యకరమైన పంట పెరుగుదలకు దోహదపడుతుంది. పంట దిగుబడి పెరుగుతుంది. పురుగు పట్టని విత్తనాలను ఎంపిక చేసుకుంటే నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంట చేతికి అందుతుంది. భౌతిక స్వచ్ఛత గల విత్తనాలను ఎంపిక చేసుకుంటే స్వచ్ఛమైన విత్తనాల స్థాయి తెలుస్తుంది. పంట ఎదుగుదల, దిగుబడిలో పెరుగుదల ఉంటుంది. జన్యు స్వచ్ఛత గల విత్తనాలను ఎంపిక చేసుకుంటే పోషకాల లోపం నివారించబడి మంచి పంట లభిస్తుంది. విత్తనాల్లో కల్తీ నివారించబడి, కేళీలు నిరోధించబడతాయి. ముందుగా శాంపిల్స్‌ను తీసుకుని, వాటిని నానబెట్టడం ద్వారా మొలకెత్తే స్థాయిని అవగాహన చేసుకోవాలి. శక్తివంతమైన విత్తనాల ఎంపిక చేసుకుంటే ప్రతికూల పరిస్థితులను సైతం తట్టుకుని మొలకెత్తుతాయి.

విత్తన ఎంపికలో జాగ్రత్త అవసరం



రైతులు విత్తనాలు విత్తుకునే ముందే తగిన జాగ్రత్తతో నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన ప్రతి దానికి బిల్లు తీసుకోవాలి. – నందిపాము మధుమోహన్, మండల వ్యవసాయాధికారి, ముసునూరు

సమన్వయంతో పట్టణ అభివృద్ధికి కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ త్రివేణిదుర్గ



మాట్లాడుతున్న చైర్ పర్సన్ త్రివేణిదుర్గ

నూజివీడు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కౌన్సిల్ సమావేశంలో ముందుగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబుకు, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపాలిటీ ప్రతిపక్ష ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి ఫొటోలు ఎందుకు ఏర్పాటు చేయలేదని కమిషనర్‌ను నిలదీశారు. దీనికి కమిషనర్ బదులిస్తూ ప్రభుత్వం పేర్కొన్న సైజులో ఫొటోలను పెట్టాల్సి ఉంటుందని, దానికి సంబంధించిన విధివిధానాలు రాగానే ఫొటోలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఇప్పటికే పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి గాను డీపీఆర్‌ను సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారన్నారు. దీనికి 32వ వార్డు కౌన్సిలర్ నాడు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలోని రహదారులన్నీ ఇరుకుగా ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం సాధ్యపడుతుందా, లేదా అనే విషయాన్ని అధికారులు తెలపాలన్నారు. ట్రిపుల్ ఐటీ వ్యర్థజలాలు గొడుగువారిగూడెం వైపునకు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, వ్యర్థజలాలను పట్టణం వెలుపలకు పంపించేందుకు శాశ్వత చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని దుర్గాప్రసాద్ ప్రశ్నించారు. దీనికి డీఈ లక్ష్మీనారాయణ బదులిస్తూ ట్రిపుల్ ఐటీ వ్యర్థ జలాలను బయటకు పంపించేందుకు 4.5 కిమీ పొడవున పైప్‌లైన్ నిర్మించేందుకు గతంలో మూడుసార్లు టెండర్లు పిలిచామని, అయితే ఎవరూ టెండర్లు వేయకపోవడం వల్ల పనులు చేపట్టలేదన్నారు. మరోసారి టెండర్లు పిలిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ఎవరు ముందుకు వచ్చినా సహకరిస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యులు లాం ప్రసాదరావు, షేక్ మెహబూబ్‌బీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలి

డీవైఈఓ సేవియా



గొల్లపల్లి ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నూజివీడు: బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉండాలని నూజివీడు డీవైఈఓ ఎం.సేవియా అన్నారు. మండలంలోని గొల్లపల్లి హైస్కూల్ ఉపాధ్యాయులు శనివారం నేనూ బడికిపోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీవైఈఓ మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో చేరాలన్నారు. విద్యతోనే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని చెప్పారు. విద్య ద్వారానే సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పనికి పంపకుండా బడికి పంపాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అయితే పుస్తకాలు, దుస్తులు, షూ, బ్యాగ్ తదితర వాటిని ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందజేస్తోందన్నారు. అంతేకాకుండా నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని సైతం పెడుతోందని చెప్పారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు ఎంఆర్‌పీకే విక్రయించాలి

ఏఓ రాజ్యలక్ష్మి

విస్సన్నపేట: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తరుణంలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను ఎంఆర్‌పీకే విక్రయించాలని ఏఓ రాజ్యలక్ష్మి అన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లతో ఏఓ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అనుమతులు ఉన్న కంపెనీల విత్తనాలను, ఎరువులను, పురుగుమందులను మాత్రమే విక్రయించాలన్నారు. రైతులకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని, స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని ఏఓ సూచించారు. అనుమతులు లేని విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జేవీవీ ప్రతినిధులు

గానుగపాడు(తిరువూరురూరల్): ఆరోగ్యాన్ని పాడుచేసే మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తులకు విద్యార్థులు దూరంగా ఉండాలని, పొగాకు ఉత్పత్తులైన సిగరెట్, బీడీలకు బానిసలు కావద్దని జనవిజ్ఞాన వేదిక తిరువూరు మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్ అన్నారు. గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ పక్షోత్సవాలలో భాగంగా పొగాకు ఉత్పత్తుల వినియోగంతో నష్టాలు అనే అంశంపై శనివారం కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు పొగాకు ఉత్పత్తుల వలన కలిగే అనర్థాలను తెలియజేస్తూ సదస్సు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిరాం, జేవీవీ జిల్లా కార్యదర్శి రాంప్రదీప్, సిబ్బంది రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు, రాము తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాగుకు రైతులు సన్నద్ధం



చాట్రాయి: ఖరీఫ్ వరి సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. రైతులు వరి నారు పోయడానికి సమాయత్తయ్యారు. మండలంలో సుమారు 9,750 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరి సాగు చేయనున్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ బోర్ల సదుపాయం ఉన్న చోట నారు పోస్తున్నారు. కొన్ని చోట్ల పొడి నారు పోస్తున్నారు. వర్షాభావాన్ని తట్టుకునేందుకు వెద జల్లు పద్ధతిలో సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయ భూములను ముందుగానే మెట్ట దుక్కులు దున్నుకుని సిద్ధం చేసుకుంటున్నారు. దున్నిన పొలాల్లో పచ్చిరొట్ట సాగు చేసుకోవడం వలన అదునుగా వర్షాలు పడితే జూలైలో వరి నాట్లు వేస్తామని రైతులు చెబుతున్నారు.

మంత్రి రామనారాయణరెడ్డికి సత్కారం



మైలవరం: ద్వారకా తిరుమలలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం వంశ పారంపర్య ధర్మకర్త, మైలవరం జమీందారు ఎస్వీఎస్ నివృతరావు దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని విజయవాడలోని మంత్రి కార్యాలయంలో శనివారం కలిసి శాలువా కప్పి, వేద పండితుల ఆశీర్వచనాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామి దేవాలయం కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథ్‌రావు, కోటప్ప కొండ ధర్మకర్త శ్రీరామకృష్ణ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన

ఇబ్రహీంపట్నం: గ్రామ పంచాయతీల్లో మెరుగైన పారిశుద్ధ్యం నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సర్వేయర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఎంపీడీ కార్యాలయంలో ఎంపీడీఓ ఉమాదేవి అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. తాగునీటి క్లోరినేషన్, పొడిచెత్త సేకరణ, డ్రెయినేజీల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. రానున్న వర్షాకాలంలో పారిశుద్ధ్య లేమితో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈఓపీఆర్డీ మనోజ్‌కుమార్, వివిధ గ్రామాల పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ ఈలప్రోలు సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి తల్లిదండ్రులకు సూచించారు. కొండపల్లిలో అంగన్‌వాడీ పిలుస్తోంది రా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో ఆటపాటలతో కూడిన విద్య అందిస్తారన్నారు. ప్రీస్కూల్ కిట్స్‌లోని అంశాలను తల్లిదండ్రులకు వివరించారు. ఇక్కడ నేర్చుకున్న విద్య ప్రాథమిక స్థాయిలోనే కాకుండా ఉన్నత స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగు పర్చేందుకు దోహదపడుతుందన్నారు. ఐదేళ్లు నిండిన చిన్నారులకు సర్టిఫికెట్లు ఇచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి

జి.కొండూరు: భార్యాభర్తల మధ్య జరిగిన వివాదంలో భర్త భార్యపై కత్తితో దాడి చేశాడు. భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్‌ఐ షబ్బీర్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. మైలవరం మండల పరిధి పొందుగల గ్రామానికి చెందిన ఈరిశెట్టి రంగారావుకు, కృష్ణాజిల్లా ఉంగుటూరు మండల పరిధి మానికొండ గ్రామానికి చెందిన రత్నకుమారికి 20 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత కొన్నేళ్లుగా వీరిద్దరి మధ్య కుటుంబ తగాదా ఉంది. ఈ క్రమంలో రత్నకుమారి కొన్ని రోజులుగా జి.కొండూరు మండల పరిధి చెవుటూరులోని తన అక్క నివాసంలో ఉంటుంది. భార్యను తన ఇంటికి తీసుకువెళ్లేందుకు శుక్రవారం సాయంత్రం చెవుటూరు వచ్చిన రంగారావు భార్యతో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన రంగారావు కత్తితో భార్యపై దాడి చేసి పరారయ్యాడు. స్వల్పంగా గాయపడిన రత్నకుమారిని కుటుంబ సభ్యులు విజయవాడలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. రత్నకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుల సంరక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి



నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

నూజివీడు: వృద్ధుల సంరక్షణకు ప్రభుత్వాలు తీసుకువచ్చిన వయో వృద్ధుల చట్టాలను అధికారులు పటిష్టంగా అమలు చేయాలని నూజివీడు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం సందర్భంగా శనివారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల్లో వృద్ధులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని వృద్ధుల సమస్యలను పరిష్కరించేందుకు మండల స్థాయిలో పోలీస్ శాఖలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పలగాని పిచ్చియ్య, కార్యదర్శి ఏయూఎం దిలీప్, కోశాధికారి కేజేడీ రిచర్డ్, జిల్లా ఉపాధ్యక్షుడు బీఎం సింగ్, విశ్వనాథం, స్టాన్లీ ప్రభాకర్, సింగ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లమందల యువకుడికి డాక్టరేట్



దారావత్ భాస్కర్

తిరువూరు: వాణిజ్యశాస్త్రంలో పరిశోధనలకు గాను ఎ.కొండూరు మండలం గొల్లమందలకు చెందిన దారావత్ భాస్కర్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. తిరువూరులోని పలు ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధ్యాపకుడిగా పనిచేసిన ఆయన ప్రస్తుతం విజయవాడ లయోలా కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. 'ఏ స్టడీ ఆన్ కస్టమర్ అవేర్నెస్ ఆన్ గ్రీన్ బ్యాంకింగ్ సర్వీసెస్ ఇన్ పబ్లిక్ అండ్ ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అంశంపై పరిశోధన చేసి రూపొందించిన సిద్ధాంత గ్రంథానికి నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు భాస్కర్ తెలిపారు. ఆచార్యులు పట్టేటి రాజశేఖర్, డాక్టర్ జాగర్లమూడి వనితల మార్గదర్శకత్వంలో తాను ఈ పరిశోధన చేశానని ఆయన తెలిపారు.

గోవధను నిషేధించాలని వినతి

తిరువూరు: స్థానిక ఒకటోవార్డు కొత్త కాలనీలో నివాసాల నడుమ గోవధ నిర్వహిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బీజేపీ నాయకులు తెలిపారు. దీనిపై శనివారం తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారికి ఫిర్యాదు చేశారు. మాంసం విక్రయ దుకాణం పేరుతో పదేళ్ల కిందట తీసుకున్న అనుమతి రద్దయినప్పటికీ అధికారుల పర్యవేక్షణ లోపంతో ఆవులను, లేగదూడలను సైతం బహిరంగంగా చంపి మాంసం విక్రయాలు జరుపుతున్నారని, గోహత్యను నిరోధించాలని వారు కోరారు. పట్టణంలో యథేచ్ఛగా జరుగుతున్న మాంసం విక్రయాలను నిషేధించి ఊరికి దూరంగా దుకాణాలు తరలించాలని కోరారు. బీజేపీ నాయకులు నాళ్ల సురేష్, ఎ. క్రాంతికుమార్, దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీకి కళాకారుల నివాళి

ముసునూరు: విప్లవ, జానపద, పౌరాణిక, సాంఘిక గేయాలతో అభిమానుల హృదయాల్లో నిలిచిన విప్లవ కవి శ్రీరంగం శ్రీనివాసరావు సదా స్మరణీయులని మండల పౌరాణిక నాటక కళాకారుల సమాఖ్య అధ్యక్ష, ఉపాధ్యక్షులు కూసం మార్కండేయులు, సత్యనారాయణ అన్నారు. సమాఖ్య ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ వర్ధంతి కార్యక్రమం చెక్కపల్లి సెంటర్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, పౌరాణిక నాటక కళాకారులు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ తెలుగు సినీ రంగంలో పలు సినిమాలలో శ్రీశ్రీ పాటలు రాసి అలరించారని చెప్పారు. విప్లవకవిగా శ్రీశ్రీ పేరు గాంచారని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు కళాకారులు, అభిమానులు నాగేశ్వరరావు, నాగరాజు, శ్రీనివాస్, రాంబాబు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నెమలికి బస్ సర్వీస్ ప్రారంభం

ఇబ్రహీంపట్నం: ప్రయాణికుల కోరిక మేరకు విజయవాడ నుంచి నెమలి గ్రామానికి అదనపు బస్ సర్వీస్ ప్రారంభించారని ఇబ్రహీంపట్నం ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటలకు విజయవాడలో బయలుదేరి వయా మైలవరం, చీమలపాడు, గంపలగూడెం మీదుగా నెమలి గ్రామానికి 10.30 గంటలకు చేరుతుందన్నారు. ప్రతి రోజూ రెండు వైపులా నాలుగు ట్రిప్పులు ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు.

శాస్త్రోక్తంగా చండీ పారాయణ, శ్రీచక్రార్చన



పంచముఖ ఆంజనేయ స్వామికి తమలపాకులతో అర్చన



చండీ పారాయణ చేస్తున్న అర్చకులు



చండీహోమం నిర్వహిస్తున్న అర్చకుడు

వైభవంగా కొనసాగుతున్న రామలింగేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విజయదుర్గా రామలింగేశ్వర స్వామివార్ల దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన శనివారం విశేష పూజలు, పారాయణలు నిర్వహించారు. శనివారం ఉదయం ప్రధాన దేవతామూర్తి అనుష్టానం, పారాయణలు, హోమాలు, బలిహరణ, విమాన గోపురం దేవతా మూర్తుల సంప్రోక్షణ వంటి కార్యక్రమాలను ఆలయ అర్చకులు జరిపించారు. అవ్వారి ఉమా శంకర దీక్షిత శర్మ పర్యవేక్షణలో ఆలయ వ్యవస్థాపకులు, పురోహితులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు పూజాదికాలు జరిపించారు. పంచముఖ ఆంజనేయ స్వామివారికి విశేషంగా తమలపాకులతో అర్చన నిర్వహించారు. రామలింగేశ్వర స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించిన అనంతరం విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో కొడారి వెంకటేష్, దేవి చైతన్య దంపతులచే శాంతి కల్యాణోత్సవాన్ని జరిపించగా, పలువురు ఉభయ దాతలు, భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని వీక్షించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో చండీ పారాయణలు, శ్రీచక్రార్చనను ఆలయ అర్చకులు నిర్వహించారు. సాయంత్రం శ్రీకల్యాణి సాయి సంకీర్తన నాట్యమండలికి చెందిన జక్కిలంక రాజారావు బృందంచే హనుమాన్ చాలీసా పారాయణ, సంకీర్తన జరిగింది. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు, ఉభయ దాతలు పాల్గొన్నారు.

నేడు పూర్ణాహుతి

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో పూర్ణాహుతి జరుగనుంది. పూర్ణాహుతితో మూడు రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం నగరోత్సవ సేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

పాఠ్యపుస్తకాల పంపిణీ

మైలవరం: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.గోపాల్ అన్నారు. మైలవరం ఆరో వార్డులోని ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ప్రభుత్వ సదుపాయాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరో వార్డు సభ్యుడు మల్లెల దుర్గారావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మధుమేహ రోగుల వైద్యశిబిరం

తిరువూరు: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఫ్యాక్టరీ సెంటర్‌లో ఆదివారం ఉదయం మధుమేహ రోగుల వైద్యశిబిరం నిర్వహిస్తామని జేవీవీ నాయకులు హరికృష్ణ, పాపారావు తెలిపారు. నాగార్జున స్కూల్ ఆవరణలో జరిగే ఈ వైద్య శిబిరంలో ఉదయం ఐదు నుంచి 11 గంటల వరకు రోగులను పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేస్తారన్నారు.

నేపియర్ గడ్డి కణుపుల పంపిణీ

కోకిలంపాడు(తిరువూరురూరల్): కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని కోకిలంపాడులో శనివారం పాడి పశువుల గ్రాసానికి అవసరమైన నేపియర్ గడ్డి కణుపులను పంపిణీ చేశారు. పాడి పశువుల్లో పాల ఉత్పత్తిని పెంచే పశుగ్రాసం ఉత్పత్తికి ఈ గడ్డి కణుపులు ఉపయోగపడతాయని తిరువూరు క్లస్టర్ మేనేజర్ సాంబశివరావు తెలిపారు. అన్ని గ్రామాల్లో వీటి పంపిణీ జరుగుతోందన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ పల్నాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఆగిరిపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో కూడిన నాణ్యమైన విద్యాబోధన లభిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తహసీల్దార్ మృత్యుంజయరావు అన్నారు. శనివారం ఆగిరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా ఆగిరిపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు విద్య ద్వారానే ఉన్నత లక్ష్యాలు చేరుకోగలరని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓలు సర్వేశ్వరరావు, ఆనంద్ కుమార్, ఆర్‌ఐ నవీన్ కుమార్, ప్రధానోపాధ్యాయిని పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన మజ్జిగ పంపిణీ



తిరువూరు: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో తిరువూరు జైబావి సెంటర్లో 75 రోజుల పాటు నిర్వహించిన మజ్జిగ చలివేంద్రాన్ని శనివారం ముగించారు. సేవా కార్యక్రమాల్లో తమ క్లబ్ ముందుంటుందని, ప్రతి ఏటా వేసవిలో ఈ చలివేంద్రాన్ని పట్టణంలో నిర్వహిస్తున్నామని జిల్లా ప్రతినిధి కొత్తగుండ్ల ప్రసాదరావు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.